విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి



వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులు

గన్‌ఫౌండ్రీ: రెండు రోజులుగా డీఆర్‌ఎస్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్‌ నిర్వహిస్తున్న స్పోర్ట్స్‌ మీట్‌ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు ఏకే అగర్వాల్‌, సంజయ్‌ అగర్వాల్‌, గౌరవ్‌ అగర్వాల్‌ మాట్లాడుతూ..వివిధ విభాగాలలో నిర్వహించిన క్రీడా పోటీల్లో 138 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ప్రతి ఏటా స్పోర్ట్స్‌ మీట్‌ను నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సంవత్సరం టేబుల్‌ టెన్నిస్‌, స్కేటింగ్‌, స్విమ్మింగ్‌, టెన్నిస్‌, కరాటే వంటి క్రీడలను నిర్వహించామని రాబోయే రోజుల్లో మరిన్ని క్రీడలను నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

గౌలిపురాను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ ఆలే భాగ్యలక్ష్మి

గౌలిపురా: గౌలిపురాను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్‌ ఆలె భాగ్యలక్ష్మి అన్నారు. డివిజన్‌లోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం ఆమె ఎస్‌.ఎస్‌.ఫ్లోరింగ్‌ పనులను (షాబాద్‌ బండల) ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. ఆలయ ప్రాంగణంలో షాబాద్‌ బండలు శిథిలావస్థకు చేరుకున్న విషయాన్ని భక్తులు, ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీంతో తాను జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో రూ.6.10 లక్షల నిధులను మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు వి.ఎస్‌.గణేష్‌ గురుస్వామి, బీజేపీ నాయకులు ఆదర్ల మహేశ్‌, ఇ.సుమన్‌ కుమార్‌ ముదిరాజ్‌, కొడి సురేందర్‌, కె.రాజ్‌ కుమార్‌, జమాల్‌పూర్‌ అశోక్‌, స్వప్న, బి.రమేశ్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మతోన్మాదాన్ని వ్యతిరేకించాలి



నాంపల్లి: మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ మనోన్మాదాన్ని వ్యతిరేకించాలని జై భారత్‌ జాతీయ ప్రధాన కార్యదర్శి ఖదిజ్ఞాసి రమణమూర్తి అన్నారు. దేశాన్ని కాపాడాలంటే హిందూ ముస్లిం ఐక్యతే ఏకైక మార్గమన్నారు. జంటనగరాల ఖదిజ్ఞాసి ధ్యాన సమాలోచన సమావేశం శనివారం ఉదయం మెహిదీపట్నంలోని అల్సా ప్లాజాలో జరిగింది. ఈ సమావేశానికి ప్రధాన వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ..మనిషి పరిపూర్ణమైన వ్యక్తిత్వానికి ఖదిజ్ఞాసి ధ్యానం చేయడమే ఏకైక మార్గమన్నారు. ఈ ధ్యానం అత్యంత హేతుబద్ధమైన ధ్యాన ప్రక్రియ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీఈ జాతీయ అధ్యక్షుడు త్రినాథ దాసు, అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకరస్వామి, జై భారత్‌ జాతీయ కార్యదర్శులు ఖదిజ్ఞాసి రజని, ఖదిజ్ఞాసి లోక్‌నాథ్‌, ఉపాధ్యక్షులు ఖదిజ్ఞాసి వంశీ, జై భారత్‌ రాష్ట్ర కార్యదర్శి రాజు, ఎస్సీ పోరాట వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్‌ గల్లా, దుర్గారెడ్డి పాల్గొన్నారు.

క్విజ్‌ పోటీలు మేధో సంపత్తిని పెంపొందిస్తాయి



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న భరత్‌

గన్‌ఫౌండ్రీ: క్విజ్‌ పోటీలు విద్యార్థులలో మేధో సంపత్తిని పెంపొందిస్తాయని ప్రముఖ క్విజ్‌ మాస్టర్‌ భరత్‌ పి.జైన్‌ అన్నారు. శనివారం కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో టీఐఎంఈ ఆధ్వర్యంలో ఆక్వా రీజియా ది స్కూల్‌ క్విజ్‌ ఫైనల్‌ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థుల ప్రతిభను చూస్తుంటే అపారమైన ఆనందం కలుగుతుందన్నారు. విద్యార్థుల ప్రదర్శన, ఆలోచన శక్తి అమోఘమని కొనియాడారు. అనంతరం ఈ పోటీల్లో బొల్లారం ఆర్మీ పబ్లిక్‌ స్కూల్‌కు చెందిన భవ్యమాన్‌ శర్మ, మయాంక్‌ కుమార్‌ గెలుపొందగా అబిడ్స్‌లోని లిటిల్‌ఫ్లవర్‌కు చెందిన విద్యార్థులు 2వ స్థానంలో నిలిచారు. గెలుపొందిన విద్యార్థులు వచ్చే నెలలో బెంగళూర్‌లో జరిగేటటువంటి జాతీయ పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

ఆదరణ కోల్పోతున్న నృత్య రూపాలను కాపాడుకోవాలి



నృత్య పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

నాంపల్లి: ఆదరణ కోల్పోతున్న కళా రూపాలను కాపాడుకోవాలని కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, నృత్య గురువు కళాకృష్ణ అన్నారు. శనివారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో స్వర నర్తన సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రనాట్య నృత్య ప్రదర్శన పోటీలు జరిగాయి. ముఖ్యఅతిథిగా నృత్య గురువు కళాకృష్ణ హాజరై ఉమా మహేశ్వరి దంపతుల చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించి ప్రసంగించారు. ఆంధ్రనాట్యానికి పూర్వ వైభవం తీసుకువచ్చే దిశగా కళాకారులు చేస్తున్న కృషిని అభినందించారు. ప్రముఖ ఆంధ్రనాట్య కళాకారిణి పద్మా మోహన్‌ మాట్లాడుతూ..70 మందికి పైగా విద్యార్థులు నృత్య పోటీల్లో పాల్గొన్నారన్నారు. అద్భుతమైన కళాకారులుగా తీర్చిదిద్దిన గురువులను, తల్లిదండ్రులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు నవతా, సునీలా, స్రవంతి, సంధ్యా, పవన్‌కుమార్‌, ధర్మ కల్పనా, సాయినాథ్‌ పాల్గొన్నారు.

అడ్డగోలు పార్కింగ్‌తోనే ట్రాఫిక్‌ ఇబ్బందులు



మార్కెట్‌ను పరిశీలిస్తున్న ట్రాఫిక్‌ ఏసీపీ ధనలక్ష్మి, ఇన్‌స్పెక్టర్‌ అంజయ్య

అబిడ్స్‌/గోల్కొండ: గుడిమల్కాపూర్‌ కూరగాయలు, పూలమార్కెట్‌లో కొంత మంది వాహనదారులు అడ్డగోలుగా పార్కింగ్‌ చేయడంతో తరచూ సమస్యలు ట్రాఫిక్‌ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని సౌత్‌జోన్‌ ట్రాఫిక్‌ ఏసీపీ ధనలక్ష్మి పేర్కొన్నారు. గుడిమల్కాపూర్‌ మార్కెట్లను ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ అంజయ్య, మార్కెట్‌ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్‌లతో కలిసి ఆమె సందర్శించారు. ట్రాఫిక్‌ ఇబ్బందులు కాకుండా ఏఏ చర్యలు తీసుకోవాలో ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ.. వాహనదారులు కార్లను, పెద్ద వాహనాలను మార్కెట్‌ లోపలికి తేవద్దని సూచించారు. ద్విచక్ర వాహనాలు, చిన్న వాహనాలు పూల మార్కెట్‌లోని పార్కింగ్‌ స్థలంలో పార్క్‌ చేయాలన్నారు. అదనపు సిబ్బందిని కేటాయించి గుడిమల్కాపూర్‌ మార్కెట్ల వద్ద ట్రాఫిక్‌ సమస్య తలెత్తకుండా చూస్తామని ధనలక్ష్మి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్‌ కార్యదర్శి శ్రీనివాస్‌, మహేష్‌, మార్కెట్‌ ఏజెంట్లు, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

‘త్వరలో సభ్యత్వ నమోదు చేపడతాం’



మాట్లాడుతున్న డాక్టర్‌ నరహరి, లాలుప్రసాద్‌ రాథోడ్‌

సుల్తాన్‌బజార్‌: తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం బలోపేతానికి త్వరలోనే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్‌ నరహరి, సెక్రెటరి జనరల్‌ డాక్టర్‌ లాలుప్రసాద్‌ రాథోడ్‌ తెలిపారు. ఈ మేరకు శనివారం కోఠిలోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. డీఎంఈ పరిధిలోని గ్రామీణ వైద్యులకు ప్రత్యేక అలవెన్సులు ఇవ్వాలన్నారు. వైద్య విధాన పరిషత్‌ 33 జిల్లాల్లో డీఎంఅండ్‌ హెచ్‌ఓ, డీసీహెచ్‌ఎస్‌ పోస్టులను క్రియేట్‌ చేయాలన్నారు. ఈఎస్‌ఐకి సీనియర్‌ వైద్యున్ని డైరెక్టర్‌గా నియమించాలని కోరారు. పదేళ్లుగా టీజీడీఏ ఎన్నికలు నిలిచిపోవడం వల్ల సభ్యత్వ నమోదు కార్యక్రమం జరగలేదని దానిని నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం కోశాధికారి డాక్టర్‌ రావూఫ్‌ సెంట్రల్‌ కమిటీ మెంబర్‌ డాక్టర్‌ రాజశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

తుమిడీ.. రెడీ

- పాతబస్తీ కేంద్రంగా తయారీ
- ఉత్తర భారతీయుల ప్రత్యేకత
- దీపావళికి తుమిడీలతో లక్ష్మీదేవికి ఆహ్వానం



ఆకట్టుకుంటున్న రంగు రంగుల తుమిడీలు



చార్మినార్‌: దీపావళికి మార్కెట్లో తుమిడీలు రెడీగా ఉన్నాయి. నగరంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న అగర్వాల్‌, మార్వాడీలు దీపావళి పండగను ‘తుమిడీ’లతో జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోంది. దీపావళి పండగకు కొత్త దుస్తులు ధరించడం.. పూజలు చేయడం..పెద్ద ఎత్తున బాణసంచా కాల్చడం.. బంధు మిత్రులకు మిఠాయిలు, కానుకలు అందజేయడం తెలుగు వారి ప్రత్యేకత. అలాగే అగర్వాల్‌ కుటుంబీకులు తమ ఆచార వ్యవహారాలకు సంస్కృతికి అద్దం పట్టే తుమిడీలను దీపావళి పండుగ సందర్భంగా అత్తగారింట్లోని తమ కుమార్తెలకు ప్రత్యేక కానుకగా అందజేస్తారు. పూలు, పండ్లు, స్వీట్స్‌లతో పాటు ఈ తుమిడీలను అత్తవారింటికి తీసుకువెళ్లి తమ కుమార్తెలకు అందజేయడం ఆనవాయితీ. దీపావళి పండుగకు ముందుగానే తుమిడీలు మార్కెట్లోకి వస్తాయి. ప్రస్తుతం పాతబస్తీలో తుమిడీల విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. నగరంలోని ఇతర ప్రాంతాల వారు సైతం పాతబస్తీకి వచ్చి తుమిడీలను ఖరీదు చేస్తున్నారు.

తుమిడీలలో 150 రకాలు..

తుమిడీలలో 150 రకాలున్నాయి. ఒక్కో తుమిడి అడుగు నుంచి 15 అడుగుల పొడవు ఉంటాయి. రూ.100 నుంచి రూ.21 వేల వరకు వీటి ఖరీదుంటుంది. తుమిడీలను రంగు రంగుల ఫర్నీలతో పాటు బట్టలతో తయారు చేస్తారు. ప్రత్యేకంగా తయారు చేసే తుమిడీల కోసం ముందుగానే ఆర్డర్‌ ఇచ్చి మరీ తయారు చేయించుకుంటారు. గుజరాత్‌, రాజస్తాన్‌, ఉత్తర్‌ప్రదేశ్‌, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలతో పాటు హైదరాబాద్‌ నగరంలోని అగర్వాల్‌ కుటుంబీకులు వీటిని తప్పనిసరిగా సంప్రదాయబద్ధంగా వినియోగిస్తారు.

రద్దీగా ఘాన్సీబజార్‌..

తుమిడీల క్రయవిక్రయాలతో ఘాన్సీబజార్‌ రద్దీగా మారింది. అగర్వాల్‌ కుటుంబీకులు ఎక్కువగా నివసించే ఘాన్సీబజార్‌ పరిసర ప్రాంతాల్లో ఈ తుమిడీల తయారు ఎక్కువగా ఉంది. ఇంట్లో ఏర్పాటు చేసే ఈ తుమిడీలలో దీపాలు వెలిగిస్తారు. దీపాంతలలో నూనె పోసి దూది ఒత్తులతో తుమిడీలలో దీపాలు వెలిగిస్తారు. ఇవి రాత్రంతా దేదీప్యమానంగా వెలుగులు విరజిమ్ముతాయి. ప్రస్తుతం దీపాంతలకు బదులు కనులు మిరిమిట్లు గొలిపే విద్యుత్‌ లైట్లను ఏర్పాటు చేస్తున్నారు.

నెల రోజుల ముందుగానే..



దీపావళి పండగకు నెల రోజుల ముందు నుంచే తుమిడీలను తయారు చేసి వినియోగదారులకు అందుబాటులో ఉంచుతాం. తుమిడీలను వివిధ రూపాల్లో రంగు రంగుల ఫర్నీలు, విద్యుత్‌ బల్బులు, క్లాత్‌లతో ఆకర్షణీయంగా తయారు చేస్తాం. ప్రత్యేకంగా కావాల్సిన వారు ముందుగానే తమకు ఆర్డర్‌ ఇస్తారు. దీపావళి పండుగకు అగర్వాల్‌ కుటుంబీకులు సంప్రదాయబద్ధంగా వినియోగిస్తారు.

– రాజేందర్‌ కుమార్‌ అగర్వాల్‌, తుమిడీల తయారీదారుడు

ఏఎంఎస్‌ విధానాన్ని రద్దు చేయండి



డిప్యూటీ సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్‌

అఫ్జల్‌గంజ్‌: మెట్రో వాటర్‌ బోర్డులో ఏఎంఎస్‌ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ కాంట్రాక్టర్స్‌ అసోసియేషన్‌ జేఏసీ మీడియా ఇన్‌చార్జి, టీపీసీసీ ఓబీసీ సెల్‌ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్‌ పేర్కొన్నారు. ఏఎంఎస్‌ విధానంతో వందలాది మంది కాంట్రాక్టర్లు అప్పులపాలయ్యారన్నారు. శనివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను పోల్కం శ్రీనివాస్‌ కలిసి మెమోరాండం అందజేశారు. కాంట్రాక్టర్లకు ప్రాణ సంకటంగా మారిన ఏఎంఎస్‌ విధానాన్ని రద్దుచేసి కాంట్రాక్టర్లను ఆదుకోవాలన్నారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయంలో ప్రారంభించిన ఏఎంఎస్‌ విధానాన్ని రద్దుచేస్తే కాంట్రాక్టర్లకు ఉపాధి కలుగుతుందన్నారు. అంతేకాక గతంలో తనతో పాటు పలువురు కాంట్రాక్టర్లు పనులు చేసినా నేటి వరకు బిల్లులు చెల్లించలేదన్నారు. తమకు రావాల్సిన లక్షలాది రూపాయాల పాత బకాయిలను ఇప్పించాలని భట్టి విక్రమార్కను కోరారు. ముఖ్యంగా తాము ఎల్‌టీసీ విధానంలో పనులు చేస్తే అప్పటి అధికారులు ఇంతవరకు బిల్లులు పాస్‌ చేయలేదన్నారు. వెంటనే పాతబకాయిలు ఇప్పించి తమను ఆదుకోవాలన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు.

ఎంఎన్‌జే చౌరస్తాలో వాహనాల తనిఖీలు



కారుకు అమర్చిన లౌడ్‌ స్పీకర్‌ను తొలగిస్తున్న పోలీసులు

నాంపల్లి: చెవులకు చిల్లులు పడేలా రోడ్లపై శబ్ధాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని నాంపల్లి ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ కిరణ్‌కుమార్‌ వాహనదారులను హెచ్చరించారు. ఈ మేరకు శనివారం సాయంత్రం ఎంఎన్‌జే కేన్సర్‌ ఆసుపత్రి చౌరస్తాలో ట్రాఫిక్‌ నిబంధనల్లో భాగంగా ట్రాఫిక్‌ పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగానే శబ్ద కాలుష్యానికి పాల్పడిన పలు వాహనాలను పట్టుకుని సీజ్‌ చేశారు. అలాగే బ్లాక్‌ ఫిల్మ్‌ కలిగిన కార్లకు చలాన్లు విధించి బ్లాక్‌ ఫిల్మ్‌లను తొలగించారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా సరే వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు.

‘రైతుల భూములను వక్ఫ్‌బోర్డుకు అందించడం రాజ్యాంగ విరుద్ధం’



శశిధర్‌

అబిడ్స్‌: మల్కాజిగిరి ప్రాంతాల్లో 750 ఎకరాల భూమిని, కర్ణాటకలోని విజయపురి జిల్లాలో రైతులకు చెందిన 1500 ఎకరాలను వక్ఫ్‌బోర్డు క్లెయిమ్‌ చేసుకోవడం రాజ్యాంగ విరుద్ధమని వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్‌ రావినూతల శశిధర్‌ పేర్కొన్నారు. రైతుల భూములను వక్ఫ్‌బోర్డు ఎలా క్లెయిమ్‌ చేసుకుంటుందని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగ విరుద్ధంగా ఉన్న వక్ఫ్‌బోర్డు చట్టంలో కేంద్ర ప్రభుత్వం మార్పులు చేసే దిశగా ఉందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ కొంతమంది వక్ఫ్‌బోర్డు చట్టాలకు అండగా ఉండడం దారుణమన్నారు. వక్ఫ్‌బోర్డు అన్యాయాలపై ప్రజలు చేసే ఉద్యామాలకు, న్యాయ పోరాటాలకు వీహెచ్‌పీ అండగా ఉంటుందని రావినూతల శశిధర్‌ వెల్లడించారు.

ఆలయంలో చోరీకి యత్నించిన వ్యక్తికి రిమాండ్‌

గౌలిపురా: ఆలయంలో చోరీకి యత్నించిన వ్యక్తిని మొఘల్‌పురా పోలీసులు శనివారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్‌ పి.నాగదుర్గాప్రసాద్‌ తెలిపిన వివరాల ప్రకారం..శాలిబండ అల్కా టాకీస్‌ ఎదురుగా ఉన్న సాయిబాబా ఆలయంలోకి ఈనెల 25న రాత్రి 8.45 గంటలకు తలాబ్‌కట్టకు చెందిన హైమద్‌ (రైమధ్‌) ప్రవేశించి దొంగతనానికి యత్నించాడు. గమనించిన స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. స్థానికులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని శనివారం హైమద్‌ను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు.


వ్యక్తి అదృశ్యం



అంజద్‌ ఖాన్‌

గౌలిపురా: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన భవానీనగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై వి.నరేందర్‌ తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన అంజద్‌ ఖాన్‌ (35) సుల్తాన్‌షాహీలోని వెల్డింగ్‌ షాపులో కార్మికుడిగా పని చేస్తున్నాడు. కాగా అంజద్‌ ఖాన్‌కు మద్యం సేవించే అలవాటు ఉంది. గతంలో పలుమార్లు మద్యం మత్తులో ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి వచ్చేవాడు. ఈ నెల 4న ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన అంజద్‌ ఖాన్‌ తిరిగి ఇప్పటి వరకు ఇంటికి చేరుకోలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఫలితం లేకుండా పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



సంతోష్‌నగర్‌: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన కంచన్‌బాగ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ జి.శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..కంచన్‌బాగ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని లక్ష్మారెడ్డి గార్డెన్‌ ఎదురుగా రోడ్డుపై ఈ నెల 25న రాత్రి 8 గంటల సమయంలో 45–50 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉంది. దీంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిలోఫర్‌ను సందర్శించిన డీఎంఈ



సాక్షి ఎఫెక్ట్‌..

నాంపల్లి: రాజీవ్‌ గాంధీ పేరు తొలగింపు! శీర్షికన సాక్షి దినపత్రికలో అక్టోబరు 25న ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. ఈ విషయం వైద్యశాఖ ముఖ్య కార్యదర్శికి చేరడంతో వెంటనే స్పందించి డీఎంఈకి విచారణకు ఆదేశించారు. దీంతో డీఎంఈ వాణి శనివారం మధ్యాహ్నం రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్‌ ఆసుపత్రిని సందర్శించారు. రాజీవ్‌ ఇంటెన్సివ్‌ కేర్‌ బ్లాక్‌ను పరిశీలించారు. భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకం వివరాలను చదివారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించినట్లుగా నిర్ధారించారు. శిలాఫలకం మీదనే రాజీవ్‌ ఇంటెన్సివ్‌ కేర్‌ బ్లాక్‌గా నామకరణం చేసి ఉన్నట్లుగా ఒక నిర్ణయానికి వచ్చారు. ఈ భవనం 30 జనవరి 2009న శిలాఫలకాన్ని ప్రారంభించి భూమి పూజ చేశారు. అయితే రాజీవ్‌ ఇంటెన్సివ్‌ కేర్‌ బ్లాక్‌ భవనానికి ఏర్పాటు చేసిన బోర్డును ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారు. ఈ విషయం స్థానికంగా తీవ్ర చర్చాంశనీయమైంది. ఇదే విషయాన్ని సాక్షి దినపత్రికలో వార్తా కథనాన్ని ప్రచురించింది. ఆసుపత్రిలోని రాజీవ్‌ ఇంటెన్సివ్‌ కేర్‌ బ్లాక్‌ను సందర్శించిన డీఎంఈ వాణీ భవన నిర్మాణ పూర్వాపరాలను సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి ఆమె వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో అడిషనల్‌ డీఎంఈ కూడా ఉన్నారు.

ఉప్పుగూడలో బీజేపీ సభ్యత్వ నమోదు



చాంద్రాయణగుట్ట: దేశానికి సుస్థిర పాలన అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని మెచ్చి ప్రజలంతా బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, చాంద్రాయణగుట్ట సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి లింగాల హరిగౌడ్‌ అన్నారు. ఉప్పుగూడ డివిజన్‌లో సీనియర్‌ నాయకుడు అక్కినమోని వెంకటేష్‌ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ దేశాల ముందు భారత్‌ ఆత్మగౌరవాన్ని పెంచిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ కన్వీనర్‌ ఎడ్ల పండరీనాథ్‌, పార్టీ నాయకులు గోపాల్‌ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్‌ డే



విద్యార్థులకు గ్రాడ్యుయేషన్‌ సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రొఫెసర్‌ లింబాద్రి, డాక్టర్‌ ప్రభాశంకర్‌

అబిడ్స్‌: వైద్య రంగంలో హైదరాబాద్‌కు ప్రపంచంలోనే పెద్ద చరిత్ర ఉందని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్‌ ప్రొఫెసర్‌ లింబాద్రి పేర్కొన్నారు. శనివారం ఎగ్జిబిషన్‌ గ్రౌండ్స్‌లో సరోజినీ నాయుడు వనితా ఫార్మసీ మహా విద్యాలయ చైర్మన్‌ డాక్టర్‌ బి.ప్రభాశంకర్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్‌ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యను పూర్తిచేసుకొని బయటకు వెళ్తున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఫార్మసీ కోర్సుకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, మానవ జీవన విధానంలో మంచి ఆరోగ్యానికి ఔషధాలను తయారు చేసే నూతన జనరేషన్‌కు వనిత ఫార్మసీ కళాశాల వేలాది మందిని సమాజానికి అందించడం గర్వకారణమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వనిత ఫార్మసీ కళాశాల నెంబర్‌:1 స్థాయిలో ఉందని విద్యార్థులకు తక్కువ ఖర్చుతో చక్కని బోధన అందిస్తుందని ప్రతి విద్యార్థికి ప్లేస్‌మెంట్‌ కూడా ఇప్పించడం ఎంతో సంతోషకరమన్నారు. కళాశాల చైర్మన్‌ డాక్టర్‌ ప్రభాశంకర్‌ మాట్లాడుతూ..సరోజినినాయుడు వనిత ఫార్మసీ మహా విద్యాలయ విద్యార్థులకు ఉత్తమమైన విద్యాబోధనను అందిస్తున్నామన్నారు. విద్యార్థులు తమ తమ గమ్యస్థానాలు చేరేవిధంగా కళాశాల యాజమాన్యం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి బి.హన్మంతరావు, కోశాధికారి సంధ్య దేపాల, సంయుక్త కార్యదర్శి చంద్రజిత్‌ సింగ్‌, ఎగ్జిబిషన్‌ సొసైటీ ఉపాధ్యక్షులు నీరంజన్‌, కార్యదర్శి బి.సురేందర్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్‌ శ్రీనివాస్‌, ప్రిన్సిపాల్‌ టి.మమత, వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.శిరీష, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీధి కుక్కలతో పరేషాన్‌

- బస్తీలు, కాలనీల్లో కుక్కల స్వైర విహారం
- బెంబేలెత్తుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



మూసి ఉన్న షాపు వద్ద..



గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

గోల్కొండ: బస్తీలు, కాలనీలతో పాటు ప్రధాన రహదారులపై కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కార్వాన్‌ నియోజకవర్గంలోని హకీంపేట్‌, టోలిచౌకీ, నానల్‌నగర్‌ తదితర ప్రాంతాల్లో కుక్కలు ఇష్టారాజ్యంగా రోడ్లపై తిరుగాడుతున్నాయి. గుడిమల్కాపూర్‌ కూరగాయల మార్కెట్‌, తాళ్లగడ్డ చౌరస్తా, షేక్‌పేట్‌, మెహిదీపట్నం తదితర ప్రాంతాల్లో సైతం గుంపులుగా కుక్కలు తిరుగుతున్నాయి. రేతిబౌలి, గోల్కొండ, శాతం చెరువు, కార్వాన్‌ తదితర ప్రాంతాల్లోని చెత్త డంపింగ్‌ యార్డుల వద్ద సైతం కుక్కలు పదుల సంఖ్యలో చేరి రోడ్లపై సంచరిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. సెవన్‌ టూమ్స్‌ రోడ్డు వారాంతపు సంత, షేక్‌పేట్‌ సీతానగర్‌, వివేకానందనగర్‌ తదితర ప్రాంతాల్లో సైతం కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. గత కొన్ని నెలల క్రితం షేక్‌పేట్‌లోని ఓ పూరి గుడిసెలో నిద్రిస్తున్న ఓ చిన్నారిని వీధి కుక్కలు ఎత్తుకుపోయి కరిచి చంపేశాయి. టోలిచౌకీ గెలాక్సీ సెంటర్‌ వద్ద సైకిల్‌పై వెళ్తున్న ఓ యువకుడిని కుక్క వెంబడించి మరీ కరిచింది. కుక్కలను పట్టే బల్దియా విభాగం వారు కేవలం కార్యాలయానికే పరిమితం అవుతున్నారు తప్ప కుక్కలు పట్టుకుపోయిన దాఖలాలు ఒకటి లేదు.

ఎటు చూసినా కుక్కలే..

టోలిచౌకీ నుంచి జూబ్లీహిల్స్‌ వెళ్లే రోడ్డుపై ఎటు చూసిన కుక్కలే కానవస్తున్నాయి. అదే విధంగా టోలిచౌకీ చౌరస్తా పరిసరాల్లో సైతం కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. కుక్కలు గుంపులుగా దారిన వెళ్తున్న ద్విచక్ర వాహనాదారులను వెంబడించి మరీ కరవడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో ద్విచక్ర వాహనం నడిపే వారు భయాందోళనకు గురై ప్రమాదాల బారినపడుతున్నారు. గుడిమల్కాపూర్‌ పూలే చౌరస్తా వద్ద సైతం రోడ్డు పక్కన ఉన్న చెత్త కుప్పల వద్ద కుక్కలు తమ స్థావరాలను ఏర్పాటు చేసుకున్నాయి. చిన్న చిన్న గుంపులుగా చెత్త కుప్పల నుంచి కుక్కలు రోడ్లపైకి వచ్చి మోరుగుతూ పాదచారులు, ద్విచక్ర వాహనాదారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఏదేమైనా కుక్కల కారణంగా ఎందరో వాహనం నడిపే వారు ప్రమాదాలకు గురవుతున్నారని కుక్కల నివారణకు బల్దియా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.